సాక్షి
అనకాపల్లి
గురువారం । 14 । ఆగస్టు । 2025



పెద్దేరు జలాశయం నుంచి నీటి విడుదల

పెద్దేరు జలాశయం ద్వారా బుధవారం రాత్రి 300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు జలాశయంలోకి 475 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందని జలాశయం ప్రాజెక్టు జేఈ సుధాకర్‌రెడ్డి బుధవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. జలాశయం పూర్తి నీటిమట్టం 137 మీటర్లు కాగా, బుధవారం సాయంత్రం నాటికి 136.40 మీటర్లకు చేరిందని, పెరుగుతున్న నీటిమట్టాన్ని దృష్టిలో ఉంచుకుని జలాశయం నుంచి నీటిని విడుదల చేశామన్నారు. - మాడుగుల రూరల్

న్యూస్‌రీల్

గంజాయి కేసులో ముద్దాయికి పదేళ్ల జైలు

చోడవరం: గంజాయి కేసులో ముద్దాయికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టు బుధవారం తీర్పు వెలువరించిందని ఎస్పీ తుహిన్‌సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. 2015లో చీడికాడ మండలం చెట్టుపల్లి సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బైలపూడి గ్రామానికి చెందిన గొల్లవిల్లి శ్రీనివాసరావు 20 కేజీల గంజాయితో పట్టుపడ్డాడు. అప్పటి ఎస్‌ఐ ఎ.కోటేశ్వరరావు కేసు నమోదు చేశారు. చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి హరినారాయణ ఈ కేసులో వాదనలు విని, నేరం రుజువు కావడంతో ముద్దాయికి శిక్ష ఖరారు చేశారు. పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా చెల్లించాలి. జరిమానా చెల్లించలేని పక్షంలో మరో 2 సంవత్సరాల ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉగ్గిన వెంకట్రావు పోలీసుల తరపున కేసు వాదించారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



అనకాపల్లి డిపో గ్యారేజ్ గేటు వద్ద ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

అనకాపల్లి: ప్రజారవాణా శాఖ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్, డిపో అధ్యక్షుడు ఎ.ఎం.రావులు డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు స్థానిక డిపో గ్యారేజీ గేటు వద్ద మధ్యాహ్నం భోజన విరామ సమయంలో బుధవారం ధర్నా చేపట్టారు. విశ్రాంత ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలని, అనారోగ్య సెలవులకు పూర్తిగా జీతం చెల్లించాలని, ఈహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థపరంగా వేతనాలు చెల్లించాలని, తీవ్రమైన అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపట్టారు. డిపో కార్యదర్శి కె.ఎస్.వి.రమేష్, కోశాధికారి ఎం.బి.రాజు, నాయకులు కె.ఎస్.భూషణం, పి.వి.ఆర్.మూర్తి, బి.ఆర్.ఎ.రావు, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు సన్నాహాలు

అనకాపల్లి టౌన్: పట్టణం నడిబొడ్డున ఉన్న ఎన్టీఆర్ గ్రౌండ్ స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబవుతోంది. గత ప్రభుత్వ హయాంలో అనకాపల్లిని జిల్లాగా ప్రకటించడంతో స్వాతంత్య్ర వేడుకలను ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఇందుకు జిల్లా యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేస్తోంది. గ్రౌండ్ మధ్యలో స్టేజ్, వివిధ ప్రభుత్వ శాఖల ప్రాముఖ్యత తెలిపే స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. వర్షం పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేస్తున్నారు.



సిట్‌లో భూములు హాంఫట్!

సిట్ నివేదికలో పేర్కొన్న భూములు హాంఫట్ అవుతున్నాయి. అపెక్స్ కమిటీ పేరుతో విలువైన భూములను సిట్ నివేదిక నుంచి తొలగిస్తూ కూటమి ప్రభుత్వం నాటకానికి తెరలేపింది. ఉమ్మడి విశాఖలో విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులు, సంస్థల చేతికి కట్టబెడుతోంది. ఇప్పటికే ఎండాడలోని రూ.100 కోట్ల విలువ చేసే 5.10 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు సంస్థలకు అప్పగించిన ప్రభుత్వం.. తాజాగా పరవాడలో రూ.70 కోట్ల విలువైన 6.26 ఎకరాల భూమిని ఓ ప్రైవేటు సంస్థకు కట్టబెట్టింది. ఈ వ్యవహారాల్లో **తెరవెనుక చినబాబు** ఉండగా.. తెర ముందు **ఒక్కోసారి ఒక్కో పాత్రధారి** వచ్చిపోతున్నారు. **వీరి ద్వారా కథ నడిపిస్తూ** కోట్లు దండుకుంటున్న**ట్లు ఆరోపణలు వినిపి**స్తున్నాయి. మొన్నటి ఎం**డాడ భూ వ్యవహారంలో** దక్షిణ నియోజకవర్గా**నికి చెందిన నేత పాత్రధారి** కాగా.. తాజాగా పర**వాడలో ఓ సు'కుమారు'డు** ఆ పాత్రను పోషించారు. **విచిత్రంగా** ఈ ఇద్దరూ ఒకే అపా**ర్ట్‌మెంటులో** నివసిస్తుండటం గమ**నార్హం.**

సు'కుమార'ంగా చక్రం తిప్పేశాడు | పరవాడలో 6.26 ఎకరాలపై నిషేధం ఎత్తివేత

- నేరుగా ప్రైవేటు సంస్థకు భూ బదలాయింపు
- సిట్‌లో లేవని.. అందుకే నిషేధం ఎత్తివేశామంటూ మెలిక
- భూమి విలువ రూ.70 కోట్లు
- సు'కుమారు'డి వాటా రూ.10 కోట్లు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై నిషేధాన్ని అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వం.. 'సిట్' నివేదికలోని భూములపై మాత్రం ఎడాపెడా నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రైవేటుపరం చేస్తోంది. ఇప్పటికే ఎండాడలో రూ.100 కోట్ల విలువైన 5.10 ఎకరాల భూమిపై నిషేధాన్ని ఎత్తివేసి ప్రైవేటు వ్యక్తుల పరం చేసిన కూటమి ప్రభుత్వం.. తాజాగా పరవాడలోని 6.26 ఎకరాలను సైతం ఓ ప్రైవేటు సంస్థ పరం చేసింది. ఈ భూమి విలువ రూ.70 కోట్లకు పైమాటే ఉంటుందని తెలుస్తోంది. ఇందుకోసం సిట్‌లో ఫలానా సర్వే నెంబర్లు లేవంటూ ఈ ఏడాది ఫిబ్రవరిలో అపెక్స్ కమిటీ మెమోను చూపించడం గమనార్హం. **ఇందుకు అనుగుణంగా అనకాపల్లి జిల్లా కలెక్టరు 6.26 ఎకరాల భూమిపై నిషేధం** ఎత్తివేస్తూ గత నెలలో ఆదేశాలు జారీ చేశారు. ఫలితంగా పరవాడలోని దేశపాత్రునిపాలెం పరిధిలోని 360-1, 360-2 సర్వే నెంబర్లలోని 6.26 ఎకరాల భూమి నేరుగా ప్రైవేటు సంస్థ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఈ వ్యవహారంలో బీచ్ రోడ్‌లో ఉండే సు'కుమార్'డు చక్రం తిప్పినట్టు తెలుస్తోంది. ఇందులో సదరు వ్యక్తి వాటా రూ.10 కోట్లు ఉంటుందని తెలుస్తోంది. అలాగే కొమ్మాది, మధురవాడ, పరవాడలోని మరికొన్ని సర్వే నెంబర్లకు చెందిన భూములపై నిషేధం ఎత్తివేయించేందుకు సదరు బ్రోకర్ భారీ స్థాయిలో డీల్స్ కుదుర్చుకున్నట్టు సమాచారం.

ఇదీ నేపథ్యం..!



పరవాడ మండలం దేశపాత్రునిపాలెం పరిధిలోని 360-1, 360-2, 360-3, 360-2 సర్వే నెంబర్లలో మొత్తం 13.25 ఎకరాల భూమిని నలుగురు మాజీ సైనికోద్యోగులకు (రమణమ్మ, ఎస్.వేణుగోపాల్ రెడ్డి, ఏఎస్‌ఆర్‌కే కుమార్, ఆర్.రామచంద్రరావు) కేటాయించారంటూ రికార్డుల్లో ఉంది. ఈ భూములను వారి నుంచి గతంలోనే కోరమాండల్ ఎస్టేట్స్ అండ్ ప్రాపర్టీస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ కొనుగోలు చేసింది. అప్పట్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో పలు భూ వివాదాలు నడుస్తున్నాయని.. భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ మంత్రి అయ్యన్న ఆరోపించారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేసి విచారణ కూడా నిర్వహించారు. దీంతో గతంలో జరిగిన భూలావాదేవీలపై నిషేధం విధించారు. ప్రధానంగా మాజీ సైనికోద్యోగులకు చెందిన భూములపై లావాదేవీలు జరగకుండా నిషేధం కొనసాగింది. ఈ నేపథ్యంలో దేశపాత్రునిపాలెం పరిధిలోని 13.25 ఎకరాల భూముల లావాదేవీలపై కూడా నిషేధం ఉంది. ఇప్పుడు హఠాత్తుగా సిట్‌లో 360-1, 360-2 సర్వే నెంబర్లు లేవని అపెక్స్ కమిటీ మెమోను చూపిస్తూ ప్రైవేటు సంస్థకు 6.26 ఎకరాల భూమిని కట్టబెట్టడం గమనార్హం.

అపెక్స్ కమిటీ పేరుతో అక్రమాలు..!

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సిట్ నివేదికపై అపెక్స్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ అపెక్స్ కమిటీ తమకు అనుకూలమైన సర్వే నెంబర్లను సిట్ నివేదిక నుంచి తప్పించేందుకు ప్రయత్నించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా దేశపాత్రునిపాలెంలోని 360-1, 360-2 సర్వే నెంబర్లకు చెందిన 6.26 ఎకరాల భూమిని సిట్ నివేదికను తప్పించినట్టు తెలుస్తోంది. ఇందుకు అనుగుణంగా 2025 ఫిబ్రవరి 14న అపెక్స్ కమిటీ అన్ని జిల్లాల కలెక్టర్లకు మెమో రూపంలో ఆదేశాలు జారీచేసింది. దీని ఆధారంగా అనకాపల్లి కలెక్టర్ పైరెండు సర్వే నెంబర్లలోని భూములపై నిషేధం ఎత్తివేస్తున్నట్టు ఉత్తర్వులు జారీచేశారు. అయితే సదరు మాజీ సైనికోద్యోగుల పేరు మీద కాకుండా.. నిబంధనలకు విరుద్ధంగా గతంలో విక్రయించిన ప్రైవేటు సంస్థ పేరు మీదనే ఉత్తర్వులు జారీచేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో సు'కుమార్' కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమాల 'కేడీ'.!

దేశపాత్రునిపాలెంలోని 6.26 ఎకరాల భూమిపై నిషేధం ఎత్తివేసేలా చేసిన వ్యవహారంలో బీచ్ రోడ్‌లో ఉండే సు'కుమార్' చక్రం తిప్పినట్టు తెలుస్తోంది. అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ కూడా ఆ భూమిని తిమ్మిని బమ్మిని చేసినందుకుగానూ ఆయాచితంగా లభించిందనే ప్రచారం ఉంది. సదరు వ్యక్తి ఓ సీనియర్ టీడీపీ ఎమ్మెల్యేకు బినామీగా వ్యవహరిస్తారనే ప్రచారం కూడా ఉంది. అతడి వద్ద మరో రూ.1,000 కోట్ల విలువ చేసే ఫైల్స్ సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. పరవాడ భూవ్యవహారంలో సదరు వ్యక్తికి రూ.10 కోట్ల వాటా దక్కినట్టు సమాచారం. సీనియర్ ఎమ్మెల్యే ద్వారా కీలక మంత్రికి.. తద్వారా చినబాబుకు దగ్గరగా ఉండి వ్యవహారాలు నడిపిస్తున్నట్టు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సిట్‌లోని భూములకు కూడా చక్రాలు వచ్చి ప్రైవేటువ్యక్తుల పరమవుతుండటం గమనార్హం

400 అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ



హర్ ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం (విశాఖ): స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో బుధవారం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఏయూ పరిపాలన భవనం వద్ద నుంచి 400 అడుగుల జాతీయ పతాకంతో ఉద్యోగులు, విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో దేశభక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏయూ ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో యువతను భాగస్వామ్యం చేస్తూ వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం ఈ ర్యాలీ సిరిపురం కూడలి, ఏయూ ఇన్ గేట్ మీదుగా మళ్లీ పరిపాలన భవనం వద్ద చేరుకోవడంతో ముగిసింది. రెక్టార్ ఆచార్య ఎస్.కిశోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, డీన్ కె.రమా సుధ, ఎస్.హరినాథ్, ఎస్.ఎం.యుగంధర్, డి.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ మార్గంలో జన్మభూమి, ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్‌లు

తాటిచెట్లపాలెం (విశాఖ): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం దారి మళ్లించిన జన్మభూమి, ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్‌లు సెప్టెంబరు 7వ తేదీ నుంచి రెగ్యులర్ మార్గంలో నడవనున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-లింగంపల్లి-విశాఖపట్నం (12805/12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 7వ తేదీ నుంచి రెగ్యులర్ మార్గంలో చర్లపల్లి, సికింద్రాబాద్, బేగంపేట స్టేషన్‌ల మీదుగా నడుస్తుంది. విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినస్-విశాఖపట్నం(18519/18520) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 7వ తేదీ నుంచి రెగ్యులర్ మార్గంలో కాజీపేట, చర్లపల్లి, సికింద్రాబాద్, స్టేషన్ల మీదుగా నడుస్తుంది.

మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌కు మారనున్న కోచ్‌లు

విశాఖపట్నం-మహబూబ్‌నగర్-విశాఖపట్నం (12861/22) ఎక్స్‌ప్రెస్‌కు అక్టోబరు 22వ తేదీ నుంచి కోచ్‌లు మారనున్నాయి. 1-ఫస్ట్ క్లాస్ ఏసీ, 2-సెకండ్ క్లాస్ ఏసీ, 6-థర్డ్ క్లాస్ ఏసీ, 1-థర్డ్ ఏసీ ఎకానమి, 6-స్లీపర్ క్లాస్, 4-జనరల్ సెకండ్ క్లాస్, 1-సెకండ్ క్లాస్ కమ్ లగేజి/దివ్యాంగ, 1-జనరేటర్ మోటార్ కార్ కోచ్‌లతో నడుస్తుంది.

స్టీల్ మెల్ట్ షాప్-2లో 72 హీట్లతో కొత్త రికార్డు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ మరో అద్భుతమైన ఘనతను సాధించింది. స్టీల్ మెల్ట్ షాప్-2 (ఎస్‌ఎంఎస్-2) విభాగంలో మంగళవారం అత్యధికంగా 72 హీట్లను ఉత్పత్తి చేసి సరికొత్త రికార్డును నెలకొల్పింది. గతంలో 2021 జనవరి 30న సాధించిన 68 హీట్ల రికార్డును ఇది అధిగమించింది. ఈ రికార్డు సాధనలో భాగంగా మూడు షిఫ్టుల్లోనూ 24 చొప్పున మొత్తం 72 హీట్లు ఉత్పత్తి అయ్యాయి. దీంతో రెండు స్టీల్ మెల్ట్ షాపులలో కలిపి మొత్తం 133 హీట్లు ఉత్పత్తి అయ్యాయి. అంతేకాకుండా మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లలో కలిపి 19,037 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి కావడం విశేషం. ఈ రికార్డు సాధనలో కృషి చేసిన ఉద్యోగులను స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులు అభినందించారు.



స్టీల్ మెల్ట్ షాప్

గవర్నర్ విందుకు క్రీడాకారుడు చరణ్‌కు ఆహ్వానం

కూర్మన్నపాలెం: వాలీబాల్ క్రీడాకారుడు అట్టాడ చరణ్‌కు గవర్నర్ కార్యాలయం నుంచి ఆహ్వానం అందింది. వడ్లపూడిలోని కణితి కాలనీలో నివాసముంటున్న చరణ్‌కు శ్రీకాకుళం కలెక్టర్ ద్వారా రాజ్‌భవన్ నుంచి గవర్నర్ కార్యదర్శి లేఖ పంపించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీ సాయంత్రం గవర్నర్ బంగ్లాలో ప్రముఖులకు ఇచ్చే విందులో పాల్గొనాలని ఆ లేఖలో పేర్కొన్నారు. చరణ్ తన మేనమామల వద్ద ఉంటూ.. విశాఖపట్నంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. ఇటీవల జరిగిన అంతర్జాతీయ వాలీబాల్ పోటీల్లో చరణ్ కాంస్య పతకం సాధించాడు. గవర్నర్ బంగ్లా నుంచి ఆహ్వానం రావడంతో చరణ్‌ను పలువురు అభినందించారు.



క్రీడాకారుడు చరణ్ (ఫైల్)

పడకేసిన పల్లె వైద్యం



వేములపూడి పీహెచ్‌సీకి వెళ్లే మెయిన్‌రోడ్డుపై ఎఫ్ఆర్‌ఎస్ వేస్తున్న ఒక ఎంఎల్‌హెచ్‌పీ

- వైద్య ఆరోగ్యశాఖలో కొరవడిన సమయపాలన
- పీహెచ్‌సీ వద్ద ఎఫ్‌ఆర్‌ఎస్ వేసి తాపీగా వెళుతున్న ఎంఎల్‌హెచ్‌పీలు
- సమయానికి తెరుచుకోని విలేజ్ క్లినిక్‌లు

నర్సీపట్నం: వైద్య ఆరోగ్యశాఖలో సమయపాలన కొరవడింది. అత్యవసర సేవల నిమిత్తం వైద్య ఆరోగ్యశాఖలో ముఖ ఆధారిత గుర్తింపు హాజరు (ఎఫ్‌ఆర్‌ఎస్)కు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఇది విలేజ్ క్లినిక్ ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలకు వరంగా మారింది. గ్రామాల్లోని విలేజ్ క్లినిక్‌లను ఉదయం 9 గంటలకు తెరవాల్సి ఉంది. మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు (ఎంఎల్‌హెచ్‌పీలు) విలేజ్ క్లినిక్‌లతో పాటు పీహెచ్‌సీల వద్ద ఎఫ్‌ఆర్‌ఎస్ వేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. వీరు దీనిని ఆసరాగా చేసుకుని నిర్ణీత సమయానికి పీహెచ్‌సీలకు చేరుకుని అక్కడ ఎఫ్‌ఆర్‌ఎస్ వేసుకుని ధీమాగా విలేజ్ క్లినిక్‌లకు వెళుతున్నారు. పీహెచ్‌సీలకు ఆయా గ్రామాల విలేజ్ క్లినిక్‌లు 15 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉంటున్నాయి. విలేజ్ క్లినిక్‌లకు వెళ్లే సరికి సమయం 10.30 నుంచి 11 గంటలు అవుతోంది. వీరు స్థానికంగా నివాసం ఉండకుండా వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఎంఎల్‌హెచ్‌పీల నిర్వాకం వల్ల గ్రామస్థాయిలో వైద్య సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో లేక ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీలు, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన పీహెచ్‌సీల వైద్యాధికారులు సైతం విశాఖ నుంచి రాకపోకలు సాగిస్తూ సమయపాలన పాటించటం లేదు. ఇదే అదునుగా ఎంఎల్‌హెచ్‌పీలు ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారు.

పర్యవేక్షణ శూన్యం

జిల్లాలో 46 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటి పరిధిలో 424 విలేజ్ క్లినిక్‌లు ఉన్నాయి. గ్రామస్థాయిలోనే ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించేందుకు గత ప్రభుత్వం ఒక్కొక్క కేంద్రానికి సుమారు రూ.25 లక్షలు వెచ్చించి విలేజ్ క్లినిక్‌లను నిర్మించింది. విలేజ్ క్లినిక్‌ల ఎంఎల్‌హెచ్‌పీలు స్థానికంగా ఉండాలనే నిబంధనలు సైతం ఉన్నాయి. ఎవరూ స్థానికంగా ఉండటం లేదు. పీహెచ్‌సీల వద్ద ఎఫ్‌ఆర్‌ఎస్ వేసుకుని ధీమాగా క్లినిక్‌లకు వెళ్తున్నారు. మధ్యాహ్నం భోజనం చేసి తిరుగు ప్రయాణమై 4 గంటలకు పీహెచ్‌సీల పరిసర ప్రాంతాలకు చేరుకుని ఎఫ్‌ఆర్‌ఎస్ వేసుకుని ఇంటి ముఖం పడుతున్నారు. క్లినిక్‌ల నిర్వహణను ఆశా కార్యకర్తల మీద వదిలేస్తున్నారు. దీనిని ప్రతి రోజు ఒక దినచర్యగా మార్చుకున్నారు. వీరు క్లినిక్‌లో రెండు గంటలకు మించి ఉండటం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది సమయపాలన పాటించటం లేదు.

విలేజ్ క్లినిక్‌లో ఎంఎల్‌హెచ్‌పీ ఉండేది రెండు గంటలే..

ఉపేక్షించేదిలేదు...



సమయపాలన పాటించని ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం. విధిగా ఉదయం 9 గంటలకు విలేజ్ క్లినిక్‌లను తెరవాలి. పీహెచ్‌సీల్లో ఎఫ్‌ఆర్‌ఎస్ వేసే సిబ్బందిని గుర్తించి, జిల్లా వైద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ వీరజ్యోతి, ఏడీఎంహెచ్‌వో, నర్సీపట్నం

గాడి తప్పిన సమయపాలన

నర్సీపట్నం మండలం, వేములపూడి పీహెచ్‌సీ పరిధి బోడపాలెం విలేజ్ క్లినిక్ ఎంఎల్‌హెచ్‌పీ కీర్తన ఉదయం 9 గంటలకు కేంద్రానికి చేరుకోవాల్సి ఉంది. వేములపూడి నుంచి బోడపాలేనికి వెళ్లాలంటే 11 కిలోమీటర్లు ప్రయాణించాలి. కానీ ఆమె బుధవారం ఉదయం 9.01 గంటలకు వేములపూడి పీహెచ్‌సీకి వెళ్లే మెయిన్ రోడ్డుపై ఎఫ్‌ఆర్‌ఎస్ వేసుకుని బోడపాలెం బయలుదేరారు. అక్కడకు సమీపంలో ఉన్న పి.కె.పల్లి వేములపూడికి 12 కిలోమీటర్లు ఉంటుంది. ఈ కేంద్రానికి సంబంధించిన ఎంఎల్‌హెచ్‌పీ సంతోషలక్ష్మి వేములపూడి పీహెచ్‌సీలో ఎఫ్‌ఆర్‌ఎస్ వేసుకుని 9.35 గంటలకు పి.కె.పల్లి బయలుదేరారు. ఆక్సాహేబుపేటకు వేములపూడికి 20 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ కేంద్రం ఎంఎల్‌హెచ్‌పీ కూడా ప్రతిరోజు వేములపూడిలో ఎఫ్‌ఆర్‌ఎస్ వేసుకుని ఆక్సాహేబుపేట వెళుతున్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో ఇదే తంతు నడుస్తోంది.

క్లుప్తంగా

ప్రే'ముంచాడు'

- పెళ్లి చేసుకోమని అడిగినందుకు హత్యాయత్నం
- నిందితుడి అరెస్ట్

అనకాపల్లి టౌన్: ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి, తీరా పెళ్లి చేసుకోమని అడిగినందుకు హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ టి. విజయ్‌కుమార్ తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన అందించిన వివరాలు.. ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ మద్దాల వారి వీధిలో నివాసముంటున్న బాధితురాలు, వరుసకు మావయ్య అయిన బోడి మహాలక్ష్మినాయుడు (23) గత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇటీవల బాధితురాలు పెళ్లి చేసుకోమని అడగడంతో నిందితుడు మంగళవారం ఆమె చేయి, మెడపై కత్తితో దాడి చేశాడు. ఈ మేరకు అందిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు, హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ డి. ఈశ్వరరావు పాల్గొన్నారు.

రెండు తులాల బంగారం కోసం చిన్నాన్నని చంపేశాడు..

- నాటు తుపాకీతో హత్య చేసిన వ్యక్తి అరెస్టు



నిందితుడు అప్పారావుని విలేకరుల ముందు హాజరుపరచి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

కొత్తవలస : కేవలం రెండు తులాల బంగారం కోసం జరిగిన వివాదం వరసకు చిన్నాన్న అయిన సిమ్మ అప్పారావును నాటు తుపాకీతో కాల్చి చంపడానికి దారి తీసిందని విజయనగరం డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. కొత్తవలస మండలం ముసిరాం గ్రామానికి చెందిన సిమ్మ అప్పారావు(70)ను తన మేనకోడలు భర్త అనకాపల్లి జిల్లా కోటపాడు మండలం పాతవలస గ్రామానికి చెందిన సిమ్మ అప్పారావు ఈ నెల 5వ తేదీన అతి సమీపం నుంచి నాటు తుపాకీతో కాల్చి చంపాడు. సీఐ సిహెచ్.షణ్ముఖరావు కేసు నమోదుచేశారు. నిందితుడు కోటపాడు రోడ్డు సీతంపేట గ్రామ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా బుధవారం పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు వివరాలను డీఎస్పీ స్థానిక విలేకరులకు వెల్లడించారు. నిందితుడు అప్పారావు భార్య ఏడాదిన్నర కిందట మృతి చెందింది. ఆమెకు సంబంధించిన బంగారం, భూమి ఇతర ఆస్తులు మేనమామ అయిన మృతుడు సిమ్మ అప్పారావు వద్ద ఉన్నట్టు తెలిపారు. సదరు బంగారం, భూమి ఇవ్వాలని నిందితుడు అప్పారావు మృతుడు అప్పారావుని పలుమార్లు అడిగాడు. అయినా బంగారం ఇవ్వకపోవడంతో ఈ నెల 5న నిందితుడు తన సొంత ఆటోలో ముసిరాం వచ్చి మరోసారి బంగారం ఇవ్వమని అడిగాడు.

ఆయన నిరాకరించడంతో తనతో పాటు తెచ్చుకున్న నాటు తుపాకీతో గుండెపై కాల్చడంతో అప్పారావు అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుడు అక్కడ నుంచి పరారయ్యాడని తెలిపారు. పాతవలస సమీపంలో ఉంచిన తుపాకీని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని అరెస్టు చేసి కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.

మహాప్రసాదం నిత్యాన్నదానం

సింహగిరిపై నిత్యాన్నదాన పథకంలో సింహాచలం దేవస్థానం అందించే అన్నప్రసాదాన్ని భక్తులు మహాప్రసాదంగా భావిస్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకున్న అనంతరం అన్నప్రసాదం స్వీకరించే తిరుగుపయనం అవ్వాలని చాలా మంది భక్తులు తపిస్తుంటారు. ఇంతటి విశిష్టత కలిగిన అప్పన్న నిత్యాన్నదాన **పథకం అమల్లోకి వచ్చి నేటి(ఆగస్టు 14)తో 36 వసంతాలు పూర్తిచేసుకుని 37వ వసంతంలోకి అడుగుపెడుతోంది.**





అన్నప్రసాదాన్ని భక్తులకు వడ్డిస్తున్న సిబ్బంది

నేటితో 36 వసంతాలు పూర్తిచేసుకున్న సింహాచల దేవస్థానం నిత్యాన్నదాన పథకం

మార్చి 31 నాటికి రూ.36.45 కోట్లకు చేరిన డిపాజిట్లు

ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు మరో రూ.2.20 కోట్లు

సింహాచలం:

రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో సింహాచలం ఒకటి. ఇక్కడ కొలువైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు రోజూ **దేశ విదేశాలకు చెందిన భక్తులు** వస్తుంటారు. వీరిలో **ఒడిశా, ఉమ్మడి తెలుగు** రాష్ట్రాల భక్తులే ఎక్కువ. స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఉచితంగా అన్నప్రసాదాన్ని అందించాలని 1989 ఆగస్టు 14న నిత్యాన్నదాన పథకాన్ని ప్రారంభించారు. అప్పట్లో దేవస్థానంలో పనిచేసిన ఉద్యోగులే ఈ పథకానికి రూ.50 వేలు తొలి విరాళం అందించారు. అప్పటి నుంచి ఈ పథకానికి దాతల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

రూ.38 కోట్లకు పైగా విరాళాలు

2024–25 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి నిత్యాన్నదాన డిపాజిట్లు 36 కోట్ల 45 లక్షల 41 వేల 720 రూపాయలకు చేరుకున్నాయంటే అది భక్తులకు సింహాచలేశుడిపై ఉన్న అచంచల విశ్వాసమే..! ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు మరో రూ.2.20 కోట్ల డిపాజిట్లు వచ్చాయి. ఈ విరాళాలను బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, వాటిపై వచ్చే వడ్డీతో భక్తులకు నిత్యం దేవస్థానం అన్నప్రసాదం అందిస్తోంది.

దాతలకు ప్రత్యేక ప్రాధాన్యత

నిత్యాన్నదాన పథకానికి విరాళాలందించే దాతలకు ప్రత్యేక గుర్తింపు ఉటుంది. రూ.10,116 ఆపై విరాళం అందించే దాతలకు దేవస్థానం బాండ్‌లు అందిస్తుంది. ఆ రోజు పరిస్థితి ఆధారంగా స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పిస్తారు. దీంతోపాటు ఏడాదిలో వారు కోరుకున్న రోజున వారి పేరు మీద భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తారు. ఆ వివరాలను ఆ రోజు అన్నప్రసాద భవనం బోర్డులో పేర్కొంటారు.

రూ.10,116 లోపు వచ్చే విరాళాలను స్వల్ప విరాళాలుగా పరిగణిస్తారు. వాటిని ప్రోవిజన్స్, ఇతర ఖర్చులకు వెచ్చిస్తారు.

రోజువారీ అన్నప్రసాదం

సింహగిరిపై ఉన్న అన్నప్రసాద భవనంలో రోజూ ఉదయం 11.30కు వడ్డన ప్రారంభమవుతుంది. సోమ నుంచి శుక్రవారం వరకు రోజూ 2 వేలు నుంచి 3,500 మందికి, శనివారాలు 5–7 వేలు, ఆదివారం రోజుల్లో 4–6 వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తారు. రోజూ రాత్రి పూట 200–500 మంది భక్తులకు కదంబం(ముక్కల పులుసు అన్నం) అందిస్తారు.

రుచి చాలా బాగుంది



శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి దర్శనం బాగా జరిగింది. కుటుంబ సభ్యుల కోరికతో తొలిసారి అన్నప్రసాదం స్వీకరించా. రుచి బాగుంది. సాంబారు ఎంతో నచ్చింది. అన్నప్రసాదం రుచి ఎలా ఉందో భక్తుల అభిప్రాయాలు తీసుకోవడం బాగుంది.

– ఆర్.రావు, భిలాయ్

మహా ప్రసాదంగా భావిస్తా..



సింహాచలేశుడి దర్శనానికి తరచూ వస్తుంటాను. అన్నదాన భవనంలో భోజనం తప్పకుండా చేస్తాను. మహాప్రసాదంగా అనుకుంటాం. దాతల సహకారంతో సింహాచలం దేవస్థానం చేస్తున్న అన్నదానం ఎంతో గొప్ప కార్యక్రమంగా భావిస్తాను.

– మణి, విజయనగరం

భక్తులకు నాణ్యమైన భోజనం



అన్నప్రసాదాన్ని భక్తులకు రుచిగా అందించేందుకు ఎప్పటికప్పుడు నాణ్యత పరిశీలిస్తాం. దీనిపై అధికారులకు ప్రత్యేక సూచనలిస్తాం. ఆఖరి పంక్తి వరకు భక్తులందరికీ ఒకే రకమైన నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. దాతల ప్రోత్సాహం చాలా ఎక్కువ.

– వి.త్రినాథరావు, ఈవో, సింహాచలం దేవస్థానం

పథకం ప్రారంభం
ఆగస్టు 14, 1989

ఒక్కో భక్తుడికి భోజనం ఖర్చు రూ.35

ఏడాదికి డిపాజిట్లపై వచ్చే వడ్డీ రూ.2.20కోట్లు

స్వల్ప(రూ.10,116 లోపు) విరాళాలు ఏడాదికి రూ.1.80 కోట్లు

విరాళాల వారీగా దాతల కేటగిరీ	
మహారాజ పోషకులు	రూ.లక్ష ఆపై ఇచ్చే దాతలు
రాజపోషకులు	రూ.50 వేలు దాటి ఇచ్చేవారు
పోషకులు	రూ.10 వేలు ఆపై ఇచ్చేవారు
దాతలు	రూ.1,116లు ఇచ్చిన వారు

(ఇప్పటి వరకు రూ.10 లక్షలకు పైగా విరాళం ఇచ్చిన వారు నలుగురుండగా, రూ.లక్ష ఆపై విరాళాలు అందించిన వారు 1,219 మంది ఉన్నారు.)



విరాళాలు అందిస్తున్న భక్తులు

విరాళాల కౌంటర్లు

సింహగిరిపై మూడు చోట్ల విరాళాల కౌంటర్లున్నాయి. దర్శనం అనంతరం ఆలయం వెలుపలికి వచ్చే మార్గం, పీఆర్వో కార్యాలయంతో పాటు, అన్నప్రసాద భవనం వద్ద విరాళాలు అందించవచ్చు. విరాళాలకు సంబంధించి ఇతర వివరాలకు 9398734612 నంబర్లో సంప్రదించవచ్చు.

జటిలంగానే పైడమ్మ చెరువు వివాదం

- మళ్లీ ఫెన్సింగ్ పనుల్ని అడ్డుకున్న వాడనర్సాపురం వాసులు
- తమ గ్రామం ఉన్నంత కాలం చెరువుని వదులుకోబోమని పునరుద్ఘాటన
- వెనుదిరిగిన నేవల్ బేస్, డీజీఎన్‌పీ సిబ్బంది
- నేడు పోలీసుల సమక్షంలో పనులు చేపట్టే అవకాశం



వాడనర్సాపురం మత్స్యకారులు, నేవల్ బేస్, డీజీఎన్‌పీ సిబ్బంది మధ్య చర్చలు జరుగుతున్న దృశ్యం

రాంబిల్లి (అచ్యుతాపురం): వాడనర్సాపురానికి ఆనుకుని ఉన్న పైడమ్మ చెరువు వివాదం జటిలంగానే ఉంది. 130 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువే ఇప్పుడు వాడనర్సాపురంతో పాటు 21 గ్రామాల ప్రధాన నీటి వనరు. ఆయా గ్రామాల మీదుగా ప్రవహించే వరద నీరు ఈ చెరువుకే చేరుతోంది. నీటి పారుదల శాఖ పరిధిలో ఉండే ఈ చెరువును బుధవారం చుట్టూ ఫెన్సింగ్ వేయాలని నేవల్ బేస్ అధికారులు, డీజీఎన్‌పీ సిబ్బంది ప్రయత్నించడంతో వాడనర్సాపురం వాసులు అడ్డుకున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య కొద్దిపాటి వాగ్వాదంతో కూడిన చర్చలు జరిగాయి. ఎట్టి పరిస్థితుల్లో చెరువుపై హక్కులు వదులుకునేది లేదని స్థానిక మత్స్యకారు చెబుతున్నారు. కానీ కొద్ది సంవత్సరాల క్రితం రెవెన్యూ శాఖ ద్వారా దఖలు పడిన ఈ చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసి తీరాలని డీజీఎన్‌పీ ధృడ నిశ్చయంతో ఉండటంతో వివాదం కొలిక్కి రాలేదు. కాగా గ్రామస్తుల ఆమోదం, పంచాయతీ తీర్మానం లేకుండా చెరువును దఖలు పరచడం కుదరదని పేర్కొనడంతో గురువారం పోలీసుల సమక్షంలో ఫెన్సింగ్ పనులు ప్రారంభించాలని నేవల్ బేస్ అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే పోలీసుల నుంచి ఈ గ్రామస్తులకు ఫోన్లు వెళ్లాయి. స్టేషన్‌కు వచ్చి కలవాలని, శాంతియుత వాతావరణంలో సమస్యను పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించడంతో గ్రామస్తులు సైతం తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే స్థానిక ఎమ్మెల్యే కలిసి సమస్యను వివరించిన వాడనర్సాపురం వాసులు రెండవ విడతలో గ్రామాన్ని తరలిస్తే తప్ప చెరువును వదులుకోబోమని పట్టుబడుతున్నారు. తీర ప్రాంతంలో ఆంక్షలు, శారదా నదిలోకి వెళ్లేందుకు ఉన్న అడ్డంకుల నేపథ్యంలో ఉన్న చెరువుని ఎలాగైనా తమకు వనరుగా ఉంచుకోవాలని స్థానికులు ఆశించడంలో ఎటువంటి తప్పు లేదని ప్రజా సంఘాల వాదన.

ఉద్రిక్తతలు ఏర్పడే అవకాశం..

పైడమ్మ చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేయాలని నేవల్ బేస్ సిద్ధం కావడం, ఈ మేరకు పోలీసుల సహకారం కోరడం వంటి పరిణామాలతో గురువారం పరిస్థితి ఉద్రిక్తంగా మారే అవకాశం ఉంది. స్వయం ప్రతిపత్తి అధికారాలు ఉన్న నేవల్ బేస్ అధికారులు రాష్ట్ర స్థాయి అధికారుల ఆదేశాలను సైతం కొన్ని సందర్భాల్లో పట్టించుకోరు. అదే సమయంలో సున్నితమైన తమ భవితవ్యం విషయంలో రాజీపడే ధోరణిలో మత్స్యకారులు లేరు. ఈ క్రమంలోనే బుధవారం చర్చలు సాఫీగా సాగి నేవల్ బేస్, డీజీఎన్‌పీ సిబ్బంది వెనక్కి వెళ్లినప్పటికీ గురువారం మళ్లీ పనులు మొదలు పెట్టే పరిస్థితి కనిపించడంతో మత్స్యకారుల్లో ఆందోళన మొదలయింది. సహజంగా తీర ప్రాంత వాసులు కాస్త ఉద్వేగంగానే ఉంటారు. అదే సమయంలో తమ ఉనికి, భవితవ్యానికి సంబంధించిన అంశం కావడంతో ఎంతకైనా పోరాడే తత్వం కలిగి ఉంటారు. మత్స్యకారుల జీవన ఆధారం, ఉన్నతాధికారుల పట్టుదల వంటి పరిణామాలతో పరిస్థితి ఎంత వరకూ వెళ్తుందో చూడాలి. రెండు వర్గాలను నియంత్రించగలిగే వ్యవస్థ జోక్యం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమయిందని చెప్పవచ్చు.

అంబులెన్స్ ఢీకొని వ్యక్తికి గాయాలు

ఎస్.రాయవరం: గోకులపాడు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఆటోను చెన్నై నుంచి కోల్‌కతా వెళ్తున్న ప్రైవేటు అంబులెన్స్ ఢీ కొట్టడంతో ఆటో డ్రైవర్ కసిరెడ్డి సత్తిబాబుకు తీవ్ర గాయాలు కాగా, ఆటో కాలువలోకి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన సత్తిబాబు అనకాపల్లి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.





కాలువలో పడిన ఆటో, తీవ్రంగా గాయపడిన సత్తిబాబు

కార్పొరేట్ సంస్థలతో రైతులకు అన్యాయం

అనకాపల్లి: మోదీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే దేశంలో రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని సంయుక్త కిసాన్ రైతు మోర్చా, రైతు కార్మిక సంఘాల నాయకులు అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పట్టణ పురవీధుల గుండా రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవసాయ చట్టాల్ని మారుస్తుందన్నారు. కనీస మద్దతు ధర ఇస్తామని ప్రకటించి రెండు సంవత్సరాలు అవుతున్నా ఎక్కడా అమలు కావడం లేదన్నారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల రుణాలను రద్దు చేయాలని, పది సంవత్సరాలు దాటిన ట్రాక్టర్లపై నిషేధాన్ని తొలగించాలని, రైతుల భూములు కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పే విధానం ఆపాలనే డిమాండ్లతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ రైతు మోర్చా జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, రైతు కూలీ సంఘం కన్వీనర్ కోన మోహన్, జిల్లా వృత్తిదారుల కన్వీనర్ గంటా శ్రీరామ్, సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, ఎస్‌వీ నాయుడు, తేలయ్య బాబు, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రైతు సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ

ప్రైవేటు బస్సు బోల్తా



నూతలగుంటపాలెం వద్ద బోల్తా పడిన ప్రైవేటు బస్సు

- ఎనిమిది మందికి గాయాలు

కశింకోట: నూతలగుంటపాలెం వద్ద బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ప్రైవేటు బస్సు బోల్తా పడి ఎనిమిదిమంది గాయపడ్డారు. ఎస్ఐ పి.మనోజ్‌కుమార్ అందించిన వివరాలు.. ఒడిశా రాష్ట్రంలోని అద్దబంగి నుంచి హైదరాబాద్ వెళుతున్న బస్సు.. ముందు వెళుతున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి నూతలగుంటపాలెం రిలయన్స్ బంక్ వద్ద రోడ్డు పక్కనున్న పల్లపు ప్రాంతంలోకి బోల్తా పడింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 8 మంది స్వల్పంగా గాయపడ్డారు. వారిని 108 వాహనంలో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భరతన్, కృష్ణారావు, పార్వతి, ఉమా, మాధవి, సనాతన రాయ్, పి.శ్రీరాములు, రాములమ్మ, బృందావతి, కె.మోహన్‌రావు గాయపడినవారిలో ఉన్నారు. ప్రమాదం జరిగే సరికి బస్సులో 37 మంది ప్రయాణిస్తున్నట్లు చెప్పారు. సంఘటన స్థలాన్ని సీఐ అల్లు స్వామినాయుడు సందర్శించి, కేసు దర్యాప్తు చేపట్టారు.



అనకాపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

గంజాయి కేసులో నలుగురి అరెస్ట్

అనకాపల్లి టౌన్: గంజాయి కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ శ్రావణి తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బెంగళూరుకు చెందిన మోహన్ (39), మిథున్ (21), అరవింద్(23), మనోజ్ కుమార్ (24) ఈ నెల 11న కారులో బెంగళూరు నుంచి అరకు చేరుకుని 17 కిలోల గంజాయి కొన్నారని తెలిపారు. దాన్ని బెంగళూరులో అధిక ధరకు అమ్మాలని రోడ్డు మార్గంలో వెళ్తుండగా బట్లపూడి గ్రామం వద్ద తనిఖీల నేపథ్యంలో పోలీసులను చూసి కారు వేగంగా నడిపారన్నారు. దీంతో అనుమానం వచ్చి కారును అడ్డగించి పోలీసులు సోదా చేశామన్నారు. కారు డిక్కీలో ఉన్న గంజాయి, కారు, సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. నిందితులను బుధవారం కోర్టుకు హాజరు పరిచినట్లు ఆమె తెలిపారు. ఈ కేసులో నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన రూరల్ ఎస్ఐ జి. రవికుమార్, హెచ్‌సీ సోంబాబు, పీసీలు శంకర్, వెంకట్రావులను డీఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ జి. అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో డీఎస్పీ శ్రావణి

గంగాదేవిపేట వద్ద ఆటో–కారు ఢీ

మునగపాక: మండలంలోని గంగాదేవిపేట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అచ్యుతాపురం మండలం పూడిమడకకు చెందిన ఆటో ప్రయాణికులతో అనకాపల్లి వెళ్తుండగా అదే సమయంలో మునగపాక మండలం తిమ్మరాజుపేటకు చెందిన కారు అనకాపల్లి నుంచి మునగపాక వైపునకు వస్తోంది. కారు టైర్ ఒక్కసారిగా పేలిపోవడంతో ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొంది. దీంతో కారు ముందు భాగం ధ్వంసమైంది. ఆటోకు కూడా నష్టం వాటిల్లింది. ఆటోలో ప్రయాణిస్తున్న వారు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.



ప్రమాదానికి గురైన ఆటో, కారు

క్లుప్తంగా

16న శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ఏర్పాట్లు



శ్రీకృష్ణాష్టమి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఈ నెల 16న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కొప్పాక శ్రీకృష్ణ ఆలయ వ్యవస్థాపకుడు దాడి వీరునాయుడు తెలిపారు. ఈ మేరకు స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో వేడుకల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణుడి అలంకరణ, భజనలు, కీర్తనలు, కోలాటాలు, తప్పెటగుళ్లు, పల్లకీ ఊరేగింపు, ఉట్టి ఉత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కర్రి సన్యాసినాయుడు, బుద్ధ రమణాజీ, కాండ్రేగుల వెంకటరమణ, దొడ్డి నూక అప్పారావు, బొడ్డేడ అప్పారావు, బొడ్డేడు మురళి, కోరుబిల్లి పరి, దాడి బుజ్జి, శరగడం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి జాతర



సత్తెమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం, దాసరిగెడ్డ రహదారి సత్తెమ్మతల్లి అమ్మవారి జాతర బుధవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. పులివేషాలు, నేలవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్టేజ్ ప్రోగ్రాంలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు యల్లపు వెంకటరమణ, అధ్యక్షుడు మద్దాల సీతారాం, కార్యదర్శి కాండ్రేగుల భీమేశ్వరరావు, కోశాధికారి దాడి వెంకయ్య నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ భూముల కౌలుకు వేలం పాట



వేణుగోపాలస్వామి ఆలయంలో పంట భూముల కౌలుకు నిర్వహిస్తున్న వేలం పాట

కశింకోట: స్థానిక దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన వేణుగోపాలస్వామి ఆలయ పంట భూములను మూడేళ్ల కాల పరిమితికి కౌలుకు ఇవ్వడానికి బుధవారం వేలం పాట నిర్వహించారు. పలు గ్రామాల్లో ఉన్న సుమారు 40 ఎకరాలకు సంబంధించి వేలం పాట జరిపారు. రైతులు ఉత్సాహంగా పాల్గొని పాట పాడారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో ఈవో సత్యనారాయణ మూర్తి ఈ వేలం పాట నిర్వహించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 44 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,850	4,850
రెండో రకం	3,400	3,400
మూడోరకం	3,200	3,300

అనకాపల్లి సినిమాలు

రాజా	: సార్ మేడమ్ (మ్యాట్నీ, సెకండ్‌షో)
రాజా	: అతడు (ఫస్ట్‌షో, మొదటిషో)
సత్యనారాయణ స్క్రీన్-1	: కింగ్ డమ్
సత్యనారాయణ స్క్రీన్-2	: సోమేశ్వర సులోచన
పర్తిసాయి	: అవతార్ నరసింహం
షిర్డిసాయి	: బకాసుర రెస్టారెంట్
వెంకటేశ్వర	: మాత్ర
శ్రీ సత్య	: జూనియర్
రామచంద్ర	: హరి హర వీరమల్లు

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 31 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5, బీ పాజిటివ్-7, ఓ పాజిటివ్-15, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యూ.లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 323 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 259 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 ఫోన్ నంబర్‌లో సంప్రదించవచ్చు.

భయపెడుతున్న కరువు ఛాయలు..!

- వర్షాలు లేక ముందుకు సాగని ఖరీఫ్ సాగు
- ఒక శాతం కూడా పడని నాట్లు
- అవి కూడా నీటి సదుపాయం ఉన్న చోటే
- వర్షాధారంగానే అత్యధికంగా వరి సాగు
- గత ఏడాది 2,200 ఎకరాల్లో ఖరీఫ్ పంట



కశింకోటలో నాట్లు వేయని పంట భూములు



నీరు లేక ఎదుగుదల లేని వరినారు

కశింకోట:

మండలంలో కొద్ది రోజులుగా వర్షాలు లేక ఖరీఫ్ వరి సాగు ముందుకు సాగడం లేదు. ఇప్పటికే చాలా వరకు వరినాట్లు పూర్తి కావలసి ఉంది. అయితే కనీసం ఒక శాతం కూడా నాట్లు పడని పరిస్థితి నెలకొంది. నీటి సదుపాయం ఉన్నచోట మాత్రం కొద్దిగా నాట్లు వేశారు. అత్యధికంగా వర్షాధారంతో పండించే ప్రాంతం కావడంతో నీరు లేక నాట్లు పడని దుస్థితి నెలకొంది. మరోవైపు వర్షాలు లేక నారుమడులు కూడా ఎండిపోతున్నాయి. మరి కొన్ని చోట్ల ఎదుగుదల లేకుండా ఉన్నాయి. రైతులు నాట్లు వేయడానికి వర్షం కోసం ఎంతో ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. మండలంలో ఈ ఏడాది సాధారణ వరి విస్తీర్ణం సుమారు 2588 ఎకరాలుగా అధికారులు నిర్ణయించారు. గత ఏడాది సాధారణ విస్తీర్ణాన్ని మించి సుమారు 2,300 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ ఏడాది కూడా వర్షాలు పడితే సాధారణ విస్తీర్ణాన్ని మించి నాట్లు పడతాయని ఆశిస్తున్నారు. ప్రధానంగా కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, తేగాడ, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, జమాదులపాలెం, విసన్నపేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, తాళ్లపాలెం, గొబ్బూరు, ఏఎస్ పేట, సోమవరం, నరసింగబిల్లి, చింతలపాలెం, జెట్టపురెడ్డితుని, నూతలగుంటపాలెం, ఏనుగుతుని, అచ్యుతాపురం, జి.భీమవరం, అచ్చెర్ల, సింగవరం, చెరకాం, అడ్డాం, సుందరయ్యపేట, తీడ, కస్నూరుపాలెం తదితర గ్రామాల్లో ఎక్కువగా వరి సాగు చేస్తారు. అత్యధిక శాతం వర్షమే ప్రధాన ఆధారం. శారదా నదిపై ఉన్న గ్రోయిన్లు, ఆనకట్టలు, రంగబోలు గెడ్డ జలాశయం నుంచి సాగునీటి కాలువల ద్వారా ఎక్కువ శాతం భూములకు సాగునీరు అందుతుంది. సాగునీటి చెరువులు ద్వారా పలు గ్రామాల్లో సాగు చేస్తారు. అయితే సరైన వర్షాలు లేక వాటిలో తగిన నీరు లేదు. దీంతో సమీపంలోని ఆయకట్టు భూములకు మాత్రమే అడపాదడపా సాగునీరు అందుతోంది. ఇలా కశింకోట, వెదురుపర్తి, పల్లపు సోమవరం, నరసింగబిల్లి, ఏనుగుతుని తదితర గ్రామాల్లో అక్కడక్కడా నాట్లు వేశారు. బోరు నీటి సదుపాయం ఉన్న చెరకాం, అడ్డాం తదితర గ్రామాల్లో నాట్లు అక్కడక్కడా పడ్డాయి. ఇలా సుమారు 25 ఎకరాల్లో నాట్లు వేసినట్లు సమాచారం. వర్షాలు పడి ఉంటే ఇప్పటికే నూతలగుంటపాలెం, ఏనుగుతుని, నరసింగబిల్లి తదితర ప్రాంతాల్లో ఎక్కువ శాతం నాట్లు పడేవి. ఈ ఏడాది ఆయా గ్రామాలకు నరసాపురం ఆనకట్ట నుంచి సాగునీరు తక్కువగా సరఫరా అవుతోంది. ముందు ఉన్న భూములకు మాత్రమే నీరు అందుతుండటంతో అడపా దడపా నాట్లు వేస్తున్నారు.

సాగునీటి సదుపాయం లేక..

నీరు లేక చాలా చోట్ల వరి నారుమడులు ఎండిపోతున్నాయి. కొన్ని చోట్ల ఎదుగుదల లేకుండా ఉన్నాయి. మరికొన్ని చోట్ల అగ్గి తెగులు ఆశించి నష్టం కలిగిస్తోంది. దీంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. కొందరు వరి నారుమళ్లు ఎండిపోవడంతో స్వల్ప కాలిక విత్తనాలను ఎద జల్లడానికి సమాయత్తం అవుతున్నారు. సాధారణంగా ఖరీఫ్ వరి మండలంలో వాతావరణం అనుకూలిస్తే జులై నెలాఖరులో ప్రారంభమవుతుంది. ఈ నెలాఖరుతో ముగుస్తుంది. ఇక నాట్లు వేయడానికి దాదాపు సగం సమయం ముగియడం, ఇంకా నాట్లు వేయడానికి సాగునీటి సదుపాయం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నారుమడి ఎండిపోతోంది..



ఎకరం భూమిలో వరి పంట వేయడానికి నారు వేశాం. వర్షాలు లేక నారుమడి ఎండిపోతోంది. తమ ప్రాంతానికి నరసాపురం ఆనకట్ట నుంచి వచ్చే సాగునీరు ఇంకా అందడం లేదు. దీంతో నాట్లు పడలేదు. వర్షాలు పడి సాగునీరు అందితే నాట్లు పడే అవకాశం ఉంది.

–అంది దేవుళమ్మ, మహిళా రైతు, ఏనుగుతుని

వచ్చే నెల 15 వరకు నాట్లు వేయొచ్చు..

మండలంలో వరి సాధారణ విస్తీర్ణం ఈ ఏడాది 2,588 ఎకరాలుగా నిర్ణయించాం. ఇప్పటికి సుమారు 25 ఎకరాల్లో నాట్లు వేశారు. వాతావరణం అనుకూలిస్తే సాధారణ విస్తీర్ణాన్ని మించి నాట్లు పడతాయని ఆశిస్తున్నాం. ముున్ముందు వర్షాలు పడే అవకాశం ఉండటం, నాట్లు వచ్చేనెల 15 వరకు వేసే అవకాశం ఉండటంతో లక్ష్యాన్ని పూర్తిగా చేయగలమని భావిస్తున్నాం.

– ఎం.స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట

చెట్టు తొలగింపు



మార్కెట్ యార్డులో ప్లొకెయిన్‌తో తొలగిస్తున్న ఎండిన చెట్టు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని రింగ్ రోడ్ మార్కెట్ యార్డులో కూలడానికి సిద్ధంగా ఉన్న ఎండిన చెట్టును తొలగించారు. కమిషనర్ చక్రవర్తి ఆదేశాల మేరకు బుధవారం జీవీఎంసీ సిబ్బంది ప్లొకెయిన్‌తో చెట్టును కూల్చివేసి, చెట్టును చిన్న ముక్కలుగా చేసి రహదారి పక్కన వేశారు.

సీపీఐ అనకాపల్లి జోన్ కార్యదర్శిగా 'తాకాసి'



సీపీఐ అనకాపల్లి జోన్ కమిటీ కార్యదర్శి తాకాసి వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి వై.ఎస్.భద్రం

అనకాపల్లి: సీపీఐ అనకాపల్లి జోన్ కార్యదర్శిగా తాకాసి వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా వై.ఎస్.భద్రం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవనంలో మంగళవారం రాత్రి ఈ ఎన్నికలు జరిగాయి. కమిటీ సభ్యులుగా కోరిబిల్లి శంకరరావు, శ్రీరామదాసు అబ్బులు, కరణం మాణిక్యాలరావు, కొమ్మనాపల్లి వెంకటరమణ, పి.నూక ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ కమిటీ రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని కార్యదర్శి తాకాసి చెప్పారు. జోనల్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు.

82వ వార్డులో మౌలిక సదుపాయాలు కల్పించాలి



జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందిస్తున్న 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు దంపతులు

అనకాపల్లి: జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధి 82వ వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు బుధవారం వార్డులో పలు సమస్యలపై కార్పొరేటర్ దంపతులు వినతిపత్రం అందజేశారు. శారదానది ఒడ్డున శాంతిపార్కులో విద్యుత్ లైట్లు బాగు చేయాలని, వాచ్‌మన్‌ను నియమించాలని కార్పొరేటర్ కోరారు. గాంధీనగరం రామాలయం వీధిలోని ఓపెన్ సైట్‌లో వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆట సామగ్రి, పాడైపోయిన ఓపెన్ జిమ్ పరికరాలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. సాయిబాబా ఆలయం నుంచి చవితిని వీధి వరకూ రహదారిని అభివృద్ధి చేయాలన్నారు. దోబీ కాలనీ, శ్రీరామ్ నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం కమిషనర్‌కు అందజేశారు.

100 మందికి రక్త పరీక్షలు



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అనకాపల్లి: స్థానిక నర్సింగరావుపేట నర్సింగ్ హోమ్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 100 మందికి రూ.1200 విలువ చేసే రక్త పరీక్షలను బుధవారం ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ ప్రోగ్రాం చైర్మన్ డి.డి.నాయుడు మాట్లాడుతూ ఫాస్ట్‌ఫుడ్‌కు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు బుద్ధ శ్రీనివాసరావు, కార్యదర్శి ప్రకాష్ రావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మరిడిమాంబ అమ్మవారి పండగ





కోట్నివీధి మరిడిమాంబ అమ్మవారు, విద్యుత్ లైటింగ్

అనకాపల్లి: పట్టణ, మండలంలో పలు ప్రాంతాల్లో గురువారం మరిడిమాంబ అమ్మవారి ఉత్సవాలను నిర్వహించేందుకు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గరపాలెం, కోట్నివీధి, గాంధీనగరం తదితర ప్రాంతాల్లో అమ్మవారి ఆలయాలను ఇప్పటికే ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించారు. కోట్నివీధిలో మరిడిమాంబ అమ్మవారి ఉత్సవం పట్టణ పరిధిలో అత్యంత వైభవంగా ప్రతి ఏటా నిర్వహిస్తారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేయనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నారు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖాధికారి సూర్యలక్ష్మి

అనకాపల్లి టౌన్: చెడు వ్యసనాల కారణంగా జీవితాలు నాశనం అవుతాయని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎస్.సూర్యలక్ష్మి హెచ్చరించారు. పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలలో బుధవారం నాసా ముక్త భారత్ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మంచి ఆలోచనలతో చదువుపై శ్రద్ధ పెట్టి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. మందుగా విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ మిషన్ కో–ఆర్డినేటర్ మేరీ సువార్త, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ ఉపాధి కోరుతూ ఆటో కార్మికుల ఆందోళన



లంకెలపాలెం కూడలిలో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

పరవాడ: ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిటు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సిటు ఆధ్వర్యంలో లంకెలపాలెం కూడలిలో ఆటో కార్మికులు బుధవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధి కల్పించకపోయినా అనేక మంది ఆటో డ్రైవర్లు ఫైనాన్స్, బ్యాంకుల్లో అప్పులు తీసుకుని ఆటోలు కొనుగోలు చేసి, వాటి ద్వారా వస్తున్న తక్కువ ఆదాయం నుంచే ఫైనాన్స్ కిస్తీలు చెల్లించుకుంటూ, కుటుంబాలను పోషించుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విధంగా రాష్ట్రంలో పది లక్షల మంది ఆటో డ్రైవర్లుగా స్వయం ఉపాధి పొందుతున్నట్లు పేర్కొన్నారు. ఆగష్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే ఆటోలకు బేరాలు తగ్గి, ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఉచిత బస్సు ప్రయాణానికి ఆటో కార్మికులు వ్యతిరేకం కాదన్నారు. ఎన్నికల్లో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో కార్మికుడికి వాహనమిత్ర పథకం కింద ఏడాదికి రూ.25 వేలు మంజూరు చేసి, ఆదుకోవాలన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లపై వ్యాట్‌ను తగ్గించాలన్నారు. 2019లో తీసుకువచ్చిన జీవో 21ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, సముద్రాలు, రాంబాబు, రాము, బాబూరావు, శ్రీను పాల్గొన్నారు.

నూతన ట్రస్ట్‌బోర్డు కమిటీకి 26లోపు దరఖాస్తు చేసుకోవాలి

అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు, స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు కమిటీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని, అర్హులైన వ్యక్తులు ఈనెల 26వ తేదీలోగా జిల్లా దేవదాయశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని నూకాంబిక అమ్మవారి దేవాలయ సహాయ కమిషనర్ కవిటపు లక్ష్మీ సుధారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర దేవదాయశాఖ ఆదేశాలు మేరకు కమిటీ సభ్యులుగా దరఖాస్తు చేసుకునే వ్యక్తులు 30 సంవత్సరాల పైబడి, హిందూ ధర్మాన్ని పాటిస్తు, వ్యక్తులపై ఎటువంటి పోలీస్ కేసులు ఉండకూడదని ఆమె పేర్కొన్నారు. కార్యాలయ పనివేళల్లో అర్హులైన వ్యక్తులు దరఖాస్తు అందజేయాలని ఆమె కోరారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

అనకాపల్లి టౌన్: సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధిని పక్కన పెట్టి కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లోకి దేశాన్ని, దేశ సంపదను దోచి పెట్టే పనులు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు, కార్యవర్గ సభ్యులు ఫణీంద్ర కుమార్, గురుబాబు, తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి రహదారులు జలమయం



నూతలగుంటపాలెం వద్ద జాతీయ రహదారి పక్కన పల్లపు ప్రాంతంలో నిలిచిన వర్షపు నీరు

కశింకోట: మండలంలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. రోడ్లు బురదమయంగా మారాయి. స్థానిక బస్ స్టేషన్‌లో నీరు చేరింది. దీంతో బస్సులు ఎక్కి, దిగడానికి ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. జాతీయ రహదారి వెంబడి పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వాహన చోదకులు రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడ్డారు. ఈ వర్షం ఎండిపోతున్న వరి నారుమడులకు ఊపిరి పోషిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి రెండు రోజుల పాటు నాటిక ప్రదర్శనలు



మాట్లాడుతున్న గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడు శ్రీకాంత్

మునగపాక: గ్రామీణ యువజన మందిరం 61వ వార్షికోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం అయింది. ఏటా వార్షికోత్సవంలో భాగంగా నాటిక ప్రదర్శనలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లా ఆహ్వాన నాటిక ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 14,15 తేదీల్లో రెండు రోజుల పాటు నాటిక ప్రదర్శనలు జరిపేందుకు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం గ్రామీణ యువజన మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్ విలేకరులతో మాట్లాడారు. నందీశ్వర కళా ప్రాంగణం తులసీ కళావేదికపై రెండు రోజుల పాటు మూడు నాటిక ప్రదర్శనలు నిర్వహించేలా చర్యలు చేపట్టామన్నారు.14వ తేదీన పెందుర్తికి చెందిన శ్రీ గౌరీ నటరాజ డ్రమటిక్ అసోసియేషన్ వారిచే 'చీమా.. చీమా.. ఎందుకు కుట్టావ్', అదేరోజు రాత్రి 8.30 గంటలకు పెందుర్తికి చెందిన నటరాజ డ్రమటిక్ అసోసియేషన్ వారిచే 'మాతృదేవోభవ'నాటిక ప్రదర్శన జరుగుతుందన్నారు. 15వ తేదీ రాత్రి 9 గంటలకు మునగపాకకు చెందిన నటరాజ ఆర్ట్స్ వారిచే 'గీత దాటితే'నాటిక ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ ప్రదర్శనలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు మళ్ల రామజగన్నాథం, కోశాధికారి ఆడారి లక్ష్మణరావు, డైరెక్టర్లు బుద్ధ నాగు, కేవీఎస్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజమాతంగేశ్వరి యాగం

అనకాపల్లి: రాజుపాలెం రోడ్డులోని లలితా దేవి పీఠంలో గురువారం రాజమాతంగేశ్వరి యాగం నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు ఎం.రాధాకృష్ణశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం చండీ ఉపాసకులు షణ్ముఖ శర్మ ఆధ్వర్యంలో యాగం, గణపతి పూజ, పుణ్యాహవచనం, తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందన్నారు. పూజలో పాల్గొనే భక్తులు ఉదయం 7 గంటల్లోపు రావాలని ఆయన కోరారు.

డీఎంహెచ్‌వో సబ్బవరం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి

సబ్బవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న అనకాపల్లి జిల్లా సెంట్రల్ డ్రగ్స్ స్టోర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హైమావతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో నిల్వవున్న వ్యాక్సిన్లు, ఆస్పత్రి ఓపీని పరిశీలించారు. ఔట్ పేషెంట్ల తాకిడి నేపథ్యంలో డ్రగ్స్ స్టోర్‌కు అదనంగా ఓ సహాయకుడిని నియమిస్తామన్నారు. ఆస్పత్రి భవనాన్ని పరిశీలించి శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించారు. దీనిపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపిస్తామన్నారు. ఆమె వెంట వైద్యాధికారి డాక్టర్ ఆశ, డాక్టర్ విద్యాధరి, సిహెచ్‌వో స్వర్ణలత,ఫార్మసిస్ట్ ఈశ్వరరావుతో పాటు మిగిలిన వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బయ్యవరంలో మిల్క్ పార్లర్ ప్రారంభం

కశింకోట: మండలంలోని బయ్యవరం గ్రామంలో విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూరల్ మిల్క్ పార్లర్అండ్ డిస్ట్రిబూషన్ సెంటర్‌ను బుధవారం డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందకుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ప్రసాద్, మార్కెటింగ్ ఏజీఎం శ్రీహరి, చీఫ్ మేనేజర్ సిహెచ్.సోమునాయుడు, ట్రస్ట్ డైరెక్టర్ తులసీరాం, యూనిట్ మేనేజర్ శరగడం రమణ, మార్కెటింగ్ మేనేజర్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

30 మద్యం సీసాలు స్వాధీనం



ట్రైనీ ఎస్ఐ పట్టుకున్న మద్యం బాటిళ్లు

నక్కపల్లి: మండలంలో అమలాపురంలో ఒక వ్యక్తి వద్ద 30 మద్యం బాటిళ్లు పట్టుకున్నట్లు ట్రైనీ ఎస్ఐ సాహీబా అంజుమ్ తెలిపారు. బుధవారం అమలాపురంలో అక్రమంగా మద్యం కలిగి ఉన్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు దాడులు చేసి, ఈ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నా రు. కేసు నమోదు చేశామని ఆమె తెలిపారు.

భూదేవి చెరువు గర్భం చెట్ల వేలం ఖరారు

పంచాయతీకి రూ.49.70 లక్షల ఆదాయం



అయ్యన్నపాలెంలో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

సబ్బవరం: మండలంలోని అయ్యన్నపాలెం రెవెన్యూ పరిధి భూదేవి చెరువు గర్భంలోని సరుగుడు ఇతర చెట్లకు నిర్వహించిన వేలం పాటలో రూ.49.70 లక్షలకు పాట ఖరారయింది. పంచాయతీ కార్యాలయం వద్ద ఈవోపీఆర్డీ చైతన్య ఆధ్వర్యంలో బుధవారం బహిరంగ వేలం జరిపారు. రావికమతం మండలం తట్టబందకు చెందిన నరసింహనాయుడు అత్యధిక పాటకు చెట్లను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ వివిధ ప్రాంతాలకు చెందిన 105 మంది వేలం పాటలో పాల్గొన్నట్లు తెలిపారు. గతంలో రెండుసార్లు మర్రిపాలెం, ఎల్లుప్పికి చెందిన ఆయకట్టు రైతులు వేలంపాటను అడ్డుకోవడంతో, పటిష్ట పోలీస్ బందోబస్తుతో వేలంపాట నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బుదిరెడ్ల లక్ష్మి, ఉప సర్పంచ్ బుదిరెడ్ల కనకరాజు, సీఐ జి.రామచంద్రరావు, భూదేవి చెరువు ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.